ప్రజాశక్తి

ఆదివారం 19 నవంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉమ్మడి విశాఖను

కరువు ప్రాంతంగా ప్రకటించండి

- అధ్వాన రోడ్లును బాగు చేయండి
- జిల్లా పరిషత్ సమావేశంలో జెడ్‌పిటిసిలు డిమాండ్
- ప్రజా సమస్యలను లేవనెత్తిన సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : మంత్రి అమర్‌నాథ్

కరువు సమస్యపై మాట్లాడుతున్న సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఉన్నందున వ్యవసాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులకు కోలుకోని నష్టం జరిగిందని, దీనిని గుర్తించడంలో జిల్లా అధికారి యంత్రాంగం పూర్తిగా విఫలమైందని పలువురు జెడ్‌పిటిసిలు ఆవేదన చెందారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖలోని అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలను తక్షణం కరువు పీడిత జిల్లాలుగా ప్రకటించాలని, సహాయ చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధ్వాన రోడ్లును బాగు చేయాలని కోరారు. శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్‌పి హాలులో జరిగింది. ప్రజా సమస్యలను జెడ్‌పిటిసిలు లేవనెత్తారు. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో కరువు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కేవలం 97 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం దుర్మార్గమని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు విమర్శించారు. గిరిజన ప్రాంతంలోని మండలాల్లో కరువు లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పడం సరికాదన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కరువు తీవ్రత ఏ స్థాయిలో ఉందో చూపిస్తానని, అధికారులు తనతో రావాలని డిమాండ్ మిగతా 2లో..

సమావేశంలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర, కలెక్టర్లు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి - 1 శ్రీనివాసరావు

బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

- తీరంలో క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ చూసేందుకు భారీ స్క్రీన్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న క్రికెట్ వరల్డ్ కప్ - 2023 ఫైనల్ మ్యాచ్‌లో ఆదివారం భారత్, ఆసీస్ తలపడుతున్న నేపథ్యంలో ఆ మ్యాచ్‌ను క్రీడాభిమానులు వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ విశాఖ ఆర్‌కె బీచ్‌లో పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. తీరంలో మూడు స్క్రీన్లు ఏర్పాటు చేయడమే కాకుండా ఫుడ్ కోర్టులనూ పెడుతోంది. దీంతో విశాఖ నగర ప్రజలు, చుట్టుపక్కల ప్రాంతాల వారు భారీగా తరలివచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామని విశాఖపట్నం డిసిపి - 1 శ్రీనివాసరావు తెలిపారు. పార్క్ హోటల్ జంక్షన్ నుంచి నోవోటల్ జంక్షన్ వరకు బీచ్ రోడ్డు గుండా ఎటువంటి వాహనాలనూ అనుమతించమని తెలిపారు. శనివారం ఉదయం పోలీస్ కమిషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌కె బీచ్‌లో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించడానికి ఎంవిపి.కాలనీ, అప్పుఘర్, చినవాల్తేరు మీదుగా వచ్చే వాహనదారులు ఎంజిఎం గ్రౌండ్‌లో వారి వాహనాలను పార్కు చేసుకోవాలన్నారు.

సిరిపురం సిఆర్ రెడ్డి మీదుగా ఆర్‌కె బీచ్‌కి వెళ్లే వాహనదారులు ఎయు ఇంగ్లీష్ మీడియం స్కూల్ జంక్షన్ నుంచి వెళ్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వాహనాలను పార్క్ చేసుకోవాలన్నారు. సిఆర్.రెడ్డి, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ మీదుగా ఆర్‌కె బీచ్‌కు వెళ్లే వాహనదారులు తమ వాహనాలను ఎపిఐఐసి గ్రౌండ్‌లో పార్కు చేసుకుని తీరానికి చేరుకోవాలన్నారు.

సంక్షేమానికి పెద్ద పీట : వైసిపి మంత్రులు

వార్త 2లో..

గ్రంథాలయాల్లో పోస్టులు భర్తీ చేయాలని ధర్నా

వార్త 2లో..

గుంతల రోడ్లపై టిడిపి, జనసేన నిరసనలు

వార్త 7లో..

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

మాట్లాడుతున్న కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపిఇపిడిసిఎల్ పరిధిలో పనిచేస్తున్న మీటర్ రీడర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన మీటర్ రీడర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మీటర్ రీడర్లు 25 సంవత్సరాలు నుండి ఇంటింటికి వెళ్లి రీడింగులు తీసి ఎపిఇపిడిసిఎల్‌కు ఆదాయాన్ని రప్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం వీరి శ్రమని దోచుకుంటున్నాయని విమర్శించారు. వీరికి ఒక రీడింగ్ తీసినందుకు కేవలం రూ.3 నుంచి 4 రూపాయల మధ్యలోనే చెల్లిస్తున్నారని, ఇది అత్యంత దోపిడీనని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మీటర్ రీడర్లందరికీ న్యాయం చేస్తామని చెప్పి గెలిచాక మోసగించారన్నారు. పీస్ రేటు విధానం రద్దుచేసి నెలవారీ జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఇప్పుడు వారిపై పని భారం పెంచే విధంగా రెండు దశల్లో 18 రోజుల్లో చేసే పనిని కేవలం పది రోజులకు కుదించడం దారుణం అన్నారు. తక్షణమే యధావిధిగా పాత పని దినాలను కొనసాగించాలని, పీస్ రేట్ విధానాన్ని రద్దుచేసి నెలవారీ జీతాలు చెల్లించాలని, అర్హతను బట్టి వీరిని దశలవారీగా సంస్థలో విలీనం మిగతా 2లో..

బిఆర్‌టిఎస్ విస్తరణ పనుల్లో ఉద్రిక్తత

- నష్టపరిహారం చెల్లించకముందే నిర్మాణాలు తొలగించిన జివిఎంసి సిబ్బంది
- బాధితులకు అండగా నిలిచిన పార్టీల నేతలు అరెస్టు
- ప్రభుత్వ, పోలీసు చర్యలను ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి - సింహాచలం : సింహాచలం తొలి పావంచా నుంచి అడవివరం వరకు చేపట్టిన బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ పనుల్లో శనివారం ఉదయం ఉద్రిక్తత చోటుచేసుకుంది. బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభించిన జివిఎంసి అధికారులకు, బాధితులకూ మధ్య వివాదం చోటుచేసుకుంది. బాధితులకు సిపిఎం, టిడిపి, వైసిపి, జనసేన నాయకులు అండగా నిలిచారు. నష్టపరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభించవద్దని, తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని తేల్చిచెప్పారు. బాధితులకు రావాల్సిన నష్టపరిహారం, టిడిఆర్‌లు చెల్లించి, ఇళ్ల ఖాళీ చేయడానికి కొంత సమయం ఇవ్వాలని కోరారు. అయినప్పటికీ జివిఎంసి అధికారులు పలు ప్రాంతాల్లో పనులకు ఉపక్రమించడంతో జెసిబిలను పార్టీల నాయకులు అడ్డుకున్నారు.

ఈ క్రమంలో స్థానిక కార్పొరేటర్ పివి.నరసింహంతో పాటు జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బెహరా భాస్కరరావు, అడవివరం సహకార పరపతి సంఘం అధ్యక్షులు కర్రి అప్పలస్వామి, జనసేన భీమిలి సమన్వయకర్త పంచకర్ల సందీప్, టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పాసర్ల ప్రసాద్‌లను అరెస్టు చేశారు. దౌర్జన్యంగా కొన్ని ఇళ్లను మిగతా 2లో..

ఇళ్లను కూలగొడుతున్న జివిఎంసి సిబ్బంది

నాయకులను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

మొదటి పేజీ తరువాయి..

డ్వాక్రా రుణాల్లో అవినీతిపై ప్రశ్నిస్తున్న గంటా శ్రీరామ్

కరువు ప్రాంతంగా ప్రకటించండి

చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర కూడా గిరిజన మండలాల్లో కరువు తీవ్రంగా ఉందని చెప్పారు.

సిఎం దృష్టికి తీసుకెళ్తా : మంత్రి అమర్‌నాథ్

సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ మూడు జిల్లాలలో కరువు పరిస్థితులపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినందున ఆ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సిఎం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖను సమీక్షిస్తూ సెప్టెంబర్ మాసానికి సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదైనందున కరువు మండలాలుగా ఏయే ప్రాంతాలను ప్రకటించాలో ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నామన్నారు.

జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జె.సుభద్ర వైద్య ఆరోగ్య శాఖను సమీక్షిస్తూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేసుకునే కొంతమంది గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ ఆర్థిక సాయం రూ.6 వేలు అందక నష్టపోతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై దృష్టి సారించాలని వైద్యాధికారులను కోరారు. నాణ్యమైన విత్తనాలు లేక రైతులు నష్టపోతున్నట్లు తెలిసిందని, దీనిపై వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు మాట్లాడుతూ అనంతగిరి మండలం నుంచి రోగులను ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తే వైద్యం అనంతరం అత్యవసరమైతే 108 ద్వారా విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేయకుండా విజయనగరం పంపిస్తున్నారని, అక్కడ కూడా అత్యవసరమైతేనే కెజిహెచ్‌కు పంపుతున్నారని తెలిపారు. అలా కాకుండా ఎస్.కోట నుంచి నేరుగా 108లో కెజిహెచ్‌కు పంపే అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందిస్తూ సమస్యను తక్షణం పరిష్కారం చేయాలని డాక్టర్ రాజేష్‌ను ఆదేశించారు. అనంతరం గంగరాజు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అనంతగిరి మండలం వంకాయపాలెం ఎంపిపి పాఠశాల విద్యార్థులకు గ్రామంలోనే పాఠశాల ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బూరుగ, చినకోనల, చిమిడివలస, తదితర గ్రామాలకు తక్షణం విద్యుత్ సరఫరా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాజుపాక నుండి డెక్కపూరం పటకదవడ రోడ్డు నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు అనుమతులు మంజూరు చేయాలన్నారు.

డ్వాక్రా రుణాల అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి : గంటా శ్రీరామ్

అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో డ్వాక్రా రుణాల అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని, బాధితులకు న్యాయం చేయాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గొర్రెలు పెంపకందారుల సహకార యూనియన్ ఛైర్మన్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. విఒఎ, సిసిని బాధ్యులు చేసి ఎపిఎం, ఎసి ధర్మారావు, బ్యాంకు అధికారులు తప్పించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. రుణాల అవినీతిలో పలువురి అధికారుల పాత్ర ఉన్నందున పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించాలన్నారు. దీనిపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి స్పందిస్తూ అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని, దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

ప్రజాప్రతినిధులు కోరిన సమాచారం ఇవ్వాలి : విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాప్రతినిధుల ఫోన్లకు జిల్లా అధికారులు స్పందించడం లేదని కొందరు జెడ్‌పిటిసిలు లేవనెత్తిన అంశంపై విశాఖ జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ఇకపై ప్రజాప్రతినిధులు కోరిన అంశాలకు సరైన సమాధానం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. పంచ గ్రామాల మరమ్మతుల కోసం గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి ఎ.పోలినాయుడు, పలు శాఖల అధికారులు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, పలువురు జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

కరువు తీర్మానం ఆమోదం

ఉమ్మడి విశాఖ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతూ జిల్లా పరిషత్తు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

బిఆర్‌టిఎస్ విస్తరణ పనుల్లో ఉద్రిక్తత

తొలగించారు. దీంతో బాధితులు నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వ తీరుపైనా, ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే రాకపోవడంపైనా దుమ్మెత్తిపోశారు. బాధితులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇళ్లను దౌర్జన్యంగా తొలగించడం దారుణమని సిపిఎం గోపాలపట్నం జోన్ నాయకులు బి.వెంకటరావు అన్నారు. అక్రమ అరెస్టులను ఖండించారు. బాధితులకు తమ పార్టీ అండగా నిలుస్తుందన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే ముత్తంశెట్టి

బిఆర్‌టిఎస్ పనుల్లో గృహాలు కోల్పోయిన వారికి అండగా ఉంటామని, స్ట్రక్చరల్ కాంపొజిషన్ మొత్తం నాలుగు రెట్లు టిడిఆర్ ఇవ్వనున్నామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అబద్ధాలతో ఆర్భాటం..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నక్క నారదుడికైనా నామం పెడుతుంది' అన్న సామెత గుర్తుకొచ్చేలాగ బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు చేస్తున్న హడావుడి ఉంది. ఏడ్చేవాడికి ఎడమ పక్కన...కుట్టే వాడికి కుడిపక్కన కూర్చోకోకూడదన్నది పెద్దలు పదేపదే చెప్పే సామెత కూడా ఇక్కడ వర్తిస్తుంది. బిజెపి నేతలు విశాఖపట్నంపై ఒలకబోస్తున్న ప్రేమ, మాటలు చూస్తే పై సామెతలు ఎవ్వరికైనా గుర్తుకురాక మానవు. వాల్తేరు రైల్వేకు డివిజన్ లేకుండా చేసి, జోన్ రాకుండా ఎండగడుతున్న కేంద్రంలోని బిజెపికి ప్రాతినిధ్యం వహిస్తున్న జివిఎల్ ప్రచారార్భాటానికి ఆకాశమే హద్దుగా మారిపోయింది. ఏటా సుమారు రూ.8500 కోట్ల పైబడి ఆదాయం తెచ్చిపెట్టిన రైల్వే డివిజన్‌ను తుడిచేసిన ఘనత ఆ పార్టీదన్నది ఉత్తరాంధ్రలో ఎవ్వరిని కదిపినా చెబుతారు. రైల్వే జోన్‌పై మోసపు మాటలు తెలిసిందే. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మేస్తామని ప్రకటించిన బిజెపిలో కొనసాగుతూ ఇటీవల ప్రైవేటీకరణ నిలిచిపోయిందంటూ ఈ ప్రాంత ప్రజానీకాన్ని మోసం చెయ్యాలని జివిఎల్ చూడడం నిజంగా ఆశ్చర్యకరమే. ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్‌పై ఇలాంటి కపట నాటకాలు కట్టిపెట్టాలంటూ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సరైన వ్యాఖ్యానమే చేయడం సందర్భోచితం కాగలదు. స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు సదరు బిజెపి సభ్యులు చేస్తున్న ప్రయత్నాలంటూ ఊకదంపుడు ఉపన్యాసాలను విశాఖలోని బిజెపి (కార్యాలయం) అబద్ధాల ఫ్యాక్టరీ నుంచి రోజూ ఉత్పత్తి చేస్తున్న విషయమూ తెలిసిందే. అమ్మేస్తాం లేదంటే మూసేస్తాం అనే విధానాన్ని ప్రధాన మంత్రి మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటిస్తే జివిఎల్ చిందులు దేనికోసం..?. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్‌లో ఒకే ఫర్నేస్‌పై పూర్తిస్థాయిలో కార్మికులు పనిచేస్తూ ఉత్పత్తిని సాధిస్తున్నారు. ఒకదాన్ని రెండేళ్లుగా

కేంద్రం మూయించేసి స్టీల్‌ప్లాంట్ ఆదాయాన్ని దెబ్బతీసే పాపం మూటగట్టుకుంది. రెండింటిలో ఒకటే పూర్తిగా నడుస్తోంది. సొంత గనుల్లేకుండా చేసిన ఘనత బిజెపిదే. నిర్వాసితుల సమస్య పరిష్కారం తమవల్లే సాధ్యమని పదేపదే చెప్పిన జివిఎల్ సుమారు 8000 ఉద్యోగాలు వారికి ఇంతవరకూ ఇవ్వకపోతే ఏం చేస్తున్నారు ?. స్టీల్‌ప్లాంట్‌ను ఎత్తేసే వ్యూహం ఆయనకు తెలుసు కాబట్టే వారికి ఉద్యోగాలు వేయించలేక చతికలపడ్డాడన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. బయటకు మాత్రం మేకపోతు గాంభీర్యం అంతా ఇంతాకాదు.

రైల్వే ప్రమాదంపైనా ఇదే వరస

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయమైన విశాఖపట్నంకు ఆ హోదా లేకుండా చేసే ప్రయత్నాలను స్వాతంత్ర్యానంతరం పకడ్బందీగా చేస్తోన్న పార్టీ ఏదైనా ఉందంటే అది బిజెపినే. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)ను అమ్మేయాలని చూశారు. 2017లో విశాఖ కేంద్రంగా జరిగిన ప్రజా, కార్మిక పోరాటాలు మేజర్ పోర్టుల పరిధిలోకి దీన్ని వుంచేలా చేశాయి. హెచ్‌పిసిఎల్‌ను నీరుగార్చేశారు. వైజాగ్ పోర్టు బెర్తులను లీజు పేర అమ్మేస్తున్నారు. ఈ పనులన్నీ చకచకా బిజెపి హయాంలోనే సాగుతున్నాయి. దేశంలోని రైల్వే వ్యవస్థను నీరుగార్చారు. రైల్వే ఈస్ట్ కోస్ట్ జోనల్ రైల్వే కన్సల్టేటివ్ సభ్యులుగా నియమితులైన జివిఎల్.నరసింహారావు కొత్తవలస రైల్వే స్టేషన్‌ను శనివారం సందర్శించి ఇటీవల కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాద ఘటనపై సమీక్ష చేశారు. 'దొంగలు పడ్డ మూడ్నెళ్లకు తేరుకున్నట్లు'గా ఆయన పరిస్థితి ఉంది. అక్కడి సిగ్నలింగ్ వ్యవస్థను, రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికుల సౌకర్యాలను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. తీరా తెలుసుకుని ఏం చేశారు ? అంటే తాను త్వరలో విశాఖ నుంచి లోక్‌సభకు బిజెపి తరపున పోటీ చేస్తానని అందుకు తగ్గ కార్యాచరణను రూపొందించుకుని తిరుగుతున్నట్లు అక్కడ 'కుండబద్దలు కొట్టారు'. ఇదీ ఆయన హడావుడి, ప్రచారార్భాటం వెనక అంతరార్థం.

ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

గ్రంథాలయాల్లో పోస్టులు భర్తీ చేయాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్రంథాలయాల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్, జిల్లా నాయకులు షణ్ముఖ, జెఎసి నాయకులు సునీల్, శ్వేత కుమారి మాట్లాడారు. లైబ్రరీ సైన్స్ చదివిన వేలాది మంది యువత ఎన్నో వ్యయప్రయాసలతో వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీ పోస్టుల నోటిఫికేషన్ కోసం ఎదురు చూశారన్నారు. వీరందరూ ప్రస్తుతం రోడ్డున పడ్డారని తెలిపారు. వీరి ఓట్లతోనే ప్రభుత్వం గెలిచిందని, గెలిచాక వీరిని పట్టించుకోకపోవటం అన్యాయమని అన్నారు. వైసిపి నాయకులు పోస్టులపైన నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారన్నారు. సమస్య పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నేడు యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : యుటిఎఫ్ 49వ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు హస్మి భవన్‌లో జరగనుందని సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాడుతుందన్నారు

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి..)

చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగుతున్న మహాధర్నాకు మీటర్ రీడర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో మీటర్ రీడర్ల యూనియన్ నాయకులు రామకృష్ణ, క్రాంతి కుమార్, గుప్తా, పోలా రావు, శ్రీనివాస్, వెంకటరావు, సురేష్ పాల్గొన్నారు.

BEFORE THE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-II AT: VISAKHAPATNEM

I.A. 130/2023 in C.C.278/2021

Between:
The Advocates Association for Social Responsibility And Awareness, Rep. by its Chief Patron, Habeeb Sultan Ali ....Complainant
Smt. Pushpa Latha Pukkella ....Defacto Complainant
And
Authorized Signatory, **MG Motor India Private Limited,** Gurugram, Haryana and 2 others ....Opposite Parties

NOTICE

To,
Opposite Party No.3:
The Manager,
Tristar Auto Agencies (Vizag),
#Plot D6, Industrial Estate, Marripalem, Visakhapatnam-530018.

The above named complainant has filed C.C.No.278/2021, against the opposite parties to replace a new MG Hector Plus 7 seater select BS6 model car, for the defected/damaged vehicle, To direct the opposite parties to pay an amount of Rs. 3,00,000/- compensation towards mental agony, deficiency of service and for such other relief or reliefs and You are shown as Opposite Party No.3 to the proceedings. Please take notice to the proceedings. Please take notice that the above matter is posted to **20-11-2023** for your appearance before the Hon'ble District Consumer Dispute Redressal Commission-II, VUDA Complex, Siripuram, Visakhapatnam at **10:30 A.M.** either yourself in person or by authorized person, failing which the Hon'ble Commission will be proceed with the matter as per law

B. NARASINGA RAO, HABEEB SULTAN ALI, B. KAVITHA & P. HYMA
Advocates, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM

I.A.587/2022 in O.S.205/2015

Between:
Chebolu Bhaskar Kumar ...Petitioner/Plaintiff
And:
Betha Suseela (died) and others ...Respondents/Defendants

Summons/Notices to Respondents 2 & 3/Proposed Defendants 2 & 3:

R-2: Betha Prathyusha,
D/o. Gopal, Hindu,
aged about 44 years,
R/at Sri Sampath Satya Sai Hospital, Bhavanam Street, Yellamanchili, Visakhapatnam.
R-3: Betha Praneetha,
D/o. Gopal, Hindu,
aged about 42 years, Rest-do-

Please take notice that the above petition I.A.587/2022 is filed to condone the delay 575 days in filing the application to implead you as the legal representative of deceased sole Defendant i.e. Betha Suseela and the same stands posted to **01-12-2023** for your notice and appearance. You are hereby directed to appear on **01-12-2023** before the Hon'ble Court by **10:30 A.M** either in person or through duly instructed Advocate, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
KVV LAW FIRM
(K.V. VISWANATH & Co.)
Advocates, Visakhapatnam

మహారాజశ్రీ అనకాపల్లి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టునందు

O.S.No. 158 / 2023

Between:
Sanapati Babu Rao ... Plaintiff
And:
Polamarasetti Sujatha ... Defendant

To
Defendant:
Polamarasetti Sujatha,
W/o. Josaph Lawrence, Residing at D.No. 2F2, Sagar View Apartments R.K.Beach, Near Kali Temple, Visakhapatnam and Presently Residing at C/o. Silaparasetti (Late) Chandrarao, Jampapalam Village, Yellamanchili Mandal.

నోటీసు

పై నెంబరు దావా ప్లయింటులో కోరిన ప్రకారం డిక్రీ యిప్పించకోరి వాది, ప్రతివాది పై పై నెంబరును దావాదాఖలు చేసిరి. సదరు దావాలో ప్రతివాదికి Suit Summons కొరకు తే:8-12-2023దీకి వాయిదా కలదు. కావున ఏమయిన ఆక్షేపణలున్నచో పైకోర్టులో **తే: 8-12-2023దీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందు మూలంగా తెలుపడమైనది.

REDNAM DURGA PRASAD
Advocate for Plaintiff
Anakapalle
Dt. 16-11-2023
Anakapalle.
Cell : 9849506151

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT CHODAVARAM

O.S.No. 7 / 2021

Between:
Parimi Prasanna ... Plaintiff
And:
Adari Satyanarayana ...Defenant

To,
The Defendant :
Adari Satyanarayana
S/o. Late Appara, D.No. 4-88
Kaspa Jagannadhapuram Village, Madugula Madal, Anakaalle Distrct.

SUIT SUMMON

Please take notice that the above mentioned court ordered that the above named plaintiff filed a suit for specific performance of agreement of sale dated 4-7-2015 in respect of the plaint schedule property against you and other reliefs in O.S.No. 7/2021 on the file of the Honourable Court of the Principal Senior Civil Judge Court, Chodavaram. You are hereby summoned to appear in the above mentioned court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above suit on **01-12-2023 at 10-30 A.M.** Indefalut of your appearance on that day, the suit will be heard and determined in your absence.

P.SREENIVASA PATNAK
Advocates,
Chodavaram
Anakapalle.
Dt. 16-11-2023

తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పిఎం పాలెం : కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం పరిధిలో ఉన్న పిఎంపాలెం నర్సరీ ప్రాంగణంలో పర్యాటకుల సందర్శన కోసం కొత్తగా రూపుదిద్దుకున్న తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రాన్ని (ఈస్ట్రన్ ఘాట్స్ బయో డైవర్సిటీ సెంటర్) శనివారం రాష్ట్ర ముఖ్య అటవీ సంరక్షణాధికారి మధుసూధనరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడవుల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించడంతో పాటు పర్యాటకంగా ఆకర్షించే విధంగా అటవీశాఖలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దీవీస్ లేబొరేటరీస్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థలు అందించిన సిఎస్ఆర్ నిధుల సంయుక్త సౌజన్యంతో కేంద్రాన్ని తీర్చిదిద్దామన్నారు. తూర్పు కనుమల్లోని అరకు, పాడేరు తదితర ప్రాంతాలతో పాటు ఇతర ప్రదేశాల నుంచి తెచ్చిన పలు రకాల మొక్కలతో అవి పెరిగే వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆర్కిడారియం ఏర్పాటుచేశామని చెప్పారు. వీటితో పాటు ఆరోగ్య, నక్షత్ర వనాలు, గ్రంథాలయం, ఆహ్లాదకరమైన వనం తదితరాలు ఇక్కడ అందుబాటులో ఉంచామన్నారు. దీని సందర్శనకు ధర నిర్ణయించి త్వరలో సందర్శకులకు అనుమతి కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐఒసిఎల్ సంజయ్‌కుమార్ వాసుదేవన్, దీవీస్ జనరల్ మేనేజర్ ఎమ్ఎస్ఎన్.రావు, గవర్నమెంట్ లైజెన్ కన్సల్టెంట్ వరహాలరెడ్డి, సిఎస్ఆర్ మేనేజర్ దేవళ్ళ సురేష్ కుమార్, విశాఖ సర్కిల్ అటవీ ప్రధాన సంరక్షణాధికారి ఎస్.శ్రీకాంతనాథరెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి అనంతశంకర్, జూ క్యూరేటర్ నందనిసలారియా, సబ్ డిఎఫ్ఒ ధర్మరక్షిత, రేంజ్ అధికారులు బి.రామనరేష్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మధుసూధనరెడ్డి

ఉత్తమ గ్రామ యాజమాన్య పద్ధతులు పరిశీలన

ప్రజాశక్తి - ఆనందపురం, పద్మనాభం : ఆనందపురం మండలంలో బోని, పద్మనాభం మండలంలోని పాండ్రంగి గ్రామాల్లో ఉత్తమ పంటల యాజమాన్య పద్ధతులు (జిఎపి) వరి పంట ధ్రువీకరణలో భాగంగా ఎక్స్‌టర్నల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్.రవి శనివారం పరిశీలించారు. విశాఖ ఉద్యానవన ఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీతో ఒప్పందం చేసుకున్న 15 మంది రైతుల ధాన్యం నమూనాలను వారి పొలాలకు వెళ్లి సేకరించారు. ఈ నమూనాలను పురుగు మందులు, ఎరువుల అవశేషాలు ఎంత మోతాదులో ఉన్నాయో పరీక్ష కోసం బెంగళూరు ల్యాబ్‌కు పంపించారు. ఈ ఉత్తమ యాజమాన్య పద్ధతులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం మంజూరైన తర్వాత రైతులు ధాన్యాన్ని ఎఫ్‌పిఒ ద్వారా మిల్లింగ్ చేసుకుని వచ్చిన బియ్యాన్ని మార్కెట్లో అమ్ముకోవడమే కాకుండా వేరే దేశాలకు కూడా ఎగుమతి చేసుకునే వీలు ఉంటుందని వివరించారు. మనదేశంలో మేలైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే దిశగా క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ పథకాన్ని అభివృద్ధి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమునిపట్నం వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్, జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ చదువుల సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయాధికారులు సిహెచ్.సంధ్య రత్నప్రభ, ఎంవి.చలం, ఎఇఒ శ్రీనివాసరావు, విఎఎలు రమాదేవి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సిఎస్‌సి అకాడమీతో 'అవంతి' ఒప్పందం

ప్రజాశక్తి -తగరపువలస : భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ సిఎస్‌సి అకాడమీతో స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు శనివారం ఆయా సంస్థ ప్రతినిధులతో కళాశాల యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఒప్పందం వల్ల విద్యార్థులకు రీసెర్చ్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ స్కిల్స్‌పై నైపుణ్యం సాధించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కోసం, సాంకేతిక రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులపై శిక్షణ ఇచ్చి ఉన్నత స్థాయికి వెళ్లేందుకు ఉపయోగపడుతుందన్నారు.

ఒప్పంద పత్రాలను చూపుతున్న కళాశాల డైరెక్టర్ చంద్రశేఖర్, సిఎస్‌సి అకాడమీ సంస్థ ప్రతినిధులు

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన భీమిలి సన్ స్కూల్‌లో శనివారం జరిగిన నెట్ బాల్ పోటీలకు భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. 14 ఏళ్లలోపు పురుషుల విభాగంలో జి జస్వంత్, పి.చందు, బాలికల విభాగంలో బి.శ్రావణి, స్టాండ్ బైగా బి.వైశాలి ఈ నెల 19న ఎన్‌టిఆర్ కృష్ణా జిల్లా నిడుమనూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ సిరిగిడి సంతోషి, వైసిపి నాయకులు ఈశ్వరరావు, ఎస్ఎంసి ఛైర్మన్ సరగడ రవి, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టిఎస్‌వి ప్రసాదరావు, సునీత, పిఇటి ప్రసాద్ కుమార్ అభినందించారు.

షిప్‌యార్డు ఎన్నికల్లో ఐఎన్‌టియుసి విజయం

ప్రజాశక్తి-ములగాడ : హిందుస్థాన్ షిప్ యార్డులో శనివారం జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టియుసి విజయం సాధించింది. హిందుస్థాన్ షిప్ యార్డు గుర్తింపు యూనియన్ ఎన్నికలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రశాంతంగా జరిగాయి. 753 ఓట్లు ఉండగా 737 ఓట్లు పోలయ్యాయి. మూడు ప్యానెళ్లు పోటీ చేశాయి. ఐఎన్‌టియుసికి 428, బిఎంఎస్‌కు 261, సిఐటియుకు 45 ఓట్లు పోలయ్యాయి. మూడు ట్లు చెల్లలేదు. తమపై నమ్మకం ఉంచి గెలిపించినందుకు కార్మికులకు ఐఎన్‌టియుసి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సమస్యలు పరిష్కారానికి చిత్త శుద్ధితో పని చేస్తామని చెప్పారు.

జంతువుల ఎన్‌క్లోజర్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్) సహకారంతో నూతనంగా నిర్మించిన నాలుగు జంతువుల ఎన్‌క్లోజర్లను శనివారం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు మధుసూదనరెడ్డి, ఐఒసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ వాసుదేవన్‌తో కలిసి ప్రారంభించారు. జూ పార్కులో జంతువుల ఎన్‌క్లోజర్ల నిర్మాణానికి నిధులు సమకూర్చిన సెర్చల్, ఐఒసిఎల్ యాజమాన్యానికి సిసిఎఫ్ అభినందనలు తెలిపారు. వైజాగ్ జూ అభివృద్ధికి మరింత సహాయ సహకారాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని సెర్చల్, ఐఒసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసుదేవన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, డిసిఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాల నాయుడు, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు భారతి, రాజేశ్వరరావు, జూ వెటర్నరీ వైద్యుడు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో ఎకో వైజాగ్

భీమునిపట్నం : స్థానిక కెజిబివిలో శనివారం ఎకో వైజాగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం మాట్లాడుతూ, జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలని, పశు పక్ష్యాదులకు నీరు, ఆహారం అందుబాటులో ఉంచాలని సూచించారు. పిచ్చుకగూళ్లు ఏర్పాటుచేసి వాటి సంతతి వృద్ధికి కృషిచేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ గంగా కుమారి, అధ్యాపకులు పావని, కీర్తి, యశోద, శాంతి, గ్రీన్ క్లైమేట్ వాలంటీర్లు రాజేశ్వరి, రవి తేజ పాల్గొన్నారు. జీవ వైవిధ్యాన్ని తెలిపే ప్లకార్డులను విద్యార్థినులు ప్రదర్శించారు

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి చేపలుప్పాడ, మండలంలోని లక్ష్మీపురంలో ఒక్కో వాలంటీర్ పోస్టుకు ఈ నెల 21, 22 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇంఛార్జి ఎండిఒ ఎ.లవరాజు శనివారం తెలిపారు. విద్యార్హత, కులం, స్థానిక నివాస వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 24న ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపికైనవారికి 27న ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పూడ్చిన గోతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని టి.నగరపాలెం పరిధిలో జలజీవన్ మిషన్ పథకం కింద పైపులైన్ వేసే క్రమంలో తవ్విన గోతులను ఎట్టకేలకు శనివారం పూడ్చారని పంచాయతీ వార్డు సభ్యులు పూసర్ల రామారావు తెలిపారు. గోతులు పూడ్చాలంటూ ఇటీవల స్పందనలో ఫిర్యాదుచేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు గాను సంబంధిత అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి -మధురవాడ : అఖిల భారత సహకార వారోత్సవాలు సందర్భంగా మధురవాడ పిఎసిఎస్ ఆవరణలో సహకార జెండాను మధురవాడ పిఎసిఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి ఎం.రమేష్‌బాబు శనివారం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. సహకార శాఖ విద్యా విభాగం అధికారి సిహెచ్.సోమేశ్వరరావు సహకార జెండా విశిష్టత, సభ్యులు పాటించే నియమ నిబంధనలు తెలిపారు. పూర్వ ఉపాధ్యక్షుడు ఎం.పైడిరాజు మాట్లాడుతూ, సంఘం తరుపున పెట్రోల్ బంక్ పెట్టాలన్న నిర్ణయాన్ని విరమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఇఒ ఎం.అప్పలరాజు, జె.అప్పారావు, సభ్యులు కె.రామారావు, ఎన్.సత్యనారాయణ, పి.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాకలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బెంగాల్ లోని కాగ్డి బర్ గ్రామానికి చెందిన సనాతన్ బర్మన్ (19) అతని అన్నయ్య సౌరబ్ తో కలిసి హెటిరో కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం నీరసంగా ఉందని డ్యూటీకి వెళ్లలేదు. అతని అన్నయ్య సౌరబ్ శుక్రవారం సాయంత్రం డ్యూటీ నుండి ఇంటికిలోకి వెళ్లగా అతని తమ్ముడు సనాతన్ బర్మన్ ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్య కారణంగా తన తమ్ముడు ఆత్మహత్య చేసుకున్నట్లు సౌరబ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు హెచ్‌సి వెంకట్రావు కేసు నమోదు చేశారు.

శ్మశాన వాటిక ప్రహరీ పనులు పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు పరిధి చిల్లపేట శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి శనివారం పరిశీలించారు. జివిఎంసి నిధులతో చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గాడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం : ఎంపిపి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపిపి డాక్టర్ మజ్జి శారదా ప్రియాంక చెప్పారు. ఆనందపురం మండలం కణమాం గ్రామపంచాయతీ గోరింట, ఎర్రవానిపాలెంలో రూ.10 లక్షలతో డ్రెయినేజీ పనులకు స్థానిక సర్పంచ్ ఆబోతు అప్పలరాము ఆధ్వర్యాన ఆమె శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మజ్జి వెంకట్రావు, ఎంపిటిసి సభ్యులు గొలగాని కృష్ణ, నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, వై. కన్నారావు, సియాద్రి పరదేశి, బంక సూరిబాబు, కోరాడ మంగ, పిల్లా ఎర్నినాయుడు, బొడ్డి సత్తిబాబు, బొద్దపు అప్పలనాయుడు, ద్వారపూడి రాజు నాయుడు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలు ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆరిలోవ : 2023 - 24 విద్యా సంవత్సరానికి ఎపి సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్ కోర్సుల్లో దరఖాస్తుకు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 16 వరకు గడువు ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు రూ.200 అపరాధ రుసుంతో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి చిన్నగదిలి మండలం రూరల్ తహశీల్దార్ కార్యాలయం పరిధిలో ఉన్న పిఎం పాలెం శ్మశాన వాటిక సమీపంలో కబ్జాకు గురైన సుమారు మూడు కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న ఆక్రమణలను తొలగించారు. పిఎం పాలెం ఆఖరి బస్టాప్ సమీపంలోని శ్మశాన వాటిక దగ్గరలో సర్వేనెంబర్ 35 లో కొంతమంది స్థానికులు ఆక్రమణలకు పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి కబ్జాకు గురైన స్థలానికి చేరుకొని సిబ్బందితో తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాదాపుగా వెయ్యి గజాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారని సమాచారం తెలుసుకుని తొలగించామని, ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ తహశీల్దార్ ఎస్.రమణయ్య, ఆర్ఐ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తొలగించిన ఆక్రమణలు

జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమణ

కార్మికుల ప్రొఫెషనల్ ట్యాక్స్ నిలుపుదలకు వినతి

ప్రజాశక్తి -గాజువాక : కార్మికుల జీతాల నుంచి కోత కోస్తున్న ప్రొఫెషనల్ ట్యాక్స్‌ను నిలుపుదల చేయాలని గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మకు సిపిఎం 79వ వార్డు కార్యదర్శి వి.వెంకటరమణ శనివారం వినతిపత్రం అందజేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిధిలో 16 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఎక్కువమంది కార్మికులు నిర్వాసితులేనని, స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఇళ్లు, భూములు త్యాగం చేసి ఉద్యోగాల రాక ఇప్పటికీ కూలి పనులతోనే నెట్టుకు వస్తున్నారని వివరించారు. ఓ పక్క ఇంటి పన్ను, చెత్త పన్ను, నీటి పన్ను, వసూలు చేస్తూనే కాంటాక్ట్ కార్మికులపై ప్రొఫెషనల్ టాక్స్ పేరుతో నెలకు రూ.200, రూ.300 వసూలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకురావడమే భారంగా ఉన్న తరుణంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా పన్నులపై పన్నులు వేసి కార్మికులు నడ్డి విరుస్తున్నారన్నారు. తక్షణమే కలుగజేసుకొని కార్మికుల నుంచి కట్ చేసిన ప్రొఫెసనల్ ట్యాక్స్‌ను నిలుపుదలచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, రాజా పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్‌కు డిఎల్‌బి గ్రౌండ్‌లో డిజిటల్ తెర

ప్రజాశక్తి-సీతమ్మధార : భారత్ -ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరుగనున్న వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు కైలాసపురం డిఎల్‌బి గ్రౌండ్‌లో డిజిటల్ తెర ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రకటించారు. అందురూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జైదుర్గ సిరామిక్స్ షాపు ప్రారంభంలో వెంకటరమణ తదితరులు

గాజువాకలో జైదుర్గ సిరామిక్స్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉక్కునగరం : హౌస్ ఆఫ్ జాన్సన్ కంపెనీకి చెందిన టైల్స్ శానిటరీ సామాగ్రి లభించే షాపు గాజువాకలో ప్రారంభమైంది. శ్రీజైదుర్గ సిరామిక్స్ పేరుతో వుడా డబుల్ రోడ్డులో ఏర్పాటయింది. ఈ సందర్భంగా నిర్వాహకులు వెంకటరమణ మాట్లాడుతూ, నాణ్యతతో కూడిన టైల్స్, శానిటరీ సామగ్రి తమ వద్ద లభిస్తాయని తెలిపారు. 80 సిఎం × 240 సిఎంతో 15 ఎంఎం మందంతో లభించే శ్లాబులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి నాణ్యత కలిగిన శానిటరీ సామాగ్రి లభిస్తాయని చెప్పారు. 2016 నుంచి జగ్గు జంక్షన్ వద్ద ఒక షోరూమ్ నడుపుతున్నట్లు తెలిపారు. కొత్తగా ఉడా డబుల్ రోడ్డులో హౌస్ ఆఫ్ జాన్సన్ కంపెనీ ఉత్పత్తులతో షాపు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. వైజాగ్ టైల్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా పని చేస్తున్నానని చెప్పారు. నాణ్యతతో కూడిన టైల్స్‌ను నగరవాసులకు అందజేయటమే లక్ష్యంగా తమ వ్యాపారం కొనసాగుతుందన్నారు. త్వరలోనే మిగిలిన అన్ని బ్రాండ్లకు సంబంధించిన శానిటరీ సామాగ్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

స్నేహపురి కాలనీలో నీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 72వ వార్డు పరిధి స్నేహపూరి కాలనీలో తాగు నీటి సమస్య పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు పివైవి రమణారావు, సిహెచ్ సత్యనారాయణ, ఎం.రాజేంద్రప్రసాద్ శనివారం జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం అందజేశారు. రెండు నెలలుగా రోజు తప్పించి రోజు సమయ పాలన లేకుండా తాగు నీరు సరఫరా అవుతుందని తెలిపారు. దీనివల్ల స్థానిక ప్రజలు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరారు.

ఇళ్ల మరమ్మతులకు దరఖాస్తులెందుకు?

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఇళ్ల మరమ్మత్తుల కోసం ఈవోకు ఎందుకు దరఖాస్తు చేసుకోవాలని సిపిఎం గోపాలపట్నం డివిజన్ కమిటీ కార్యదర్శి బలివాడ వెంకటరావు ప్రశ్నించారు. గోపాలపట్నం సిఐటియు కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన 23 సంవత్సరాలుగా భూ సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల పంచ గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటి మీద రేకుల షెడ్డు వేసుకోనీయడంలేదని, చివరకు కాలిపోయిన పూరిపాక స్థానంలో రేకుల షెడ్డు కూడా కట్టుకోనీయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన స్కీమ్ ఇళ్లను కూడా కట్టుకొనివ్వట్లేదన్నారు. దేవస్థానం భూ సమస్య కోర్టు పెండింగ్‌లో ఉన్నందున, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కంటితుడుపు చర్యల్లో భాగంగా ఇంటి మరమ్మతుల కోసం సింహాచలం ఈవోకు దరఖాస్తు చేసుకోమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణీయం కాదని పేర్కొన్నారు. ఈ భూ వివాదాన్ని కోర్టులకు వదలకుండా అన్ని తరగతులు, వర్గాలు, ఈ సమస్యపై 23 సంవత్సరాలుగా పోరాడుతున్న సంఘాలు, రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించి జన ఆమోదమైన పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి షరతులు, ఎవరికీ దరఖాస్తులు చేసుకోకుండా ఇళ్ల మరమ్మత్తుకు అనుమతించాలని కోరారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.విజయలక్ష్మి బి.రమణి, ముద్దాడ వరప్రసాద్, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

పలుచోట్ల కళంజియ ఉద్యమ దినోత్సవం

కళంజియ దినోత్సవంలో పాల్గొన్న పొదుపు సంఘాల మహిళలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎంవిపి.కాలనీ : సాగరతీర కళంజియ సమాఖ్య 26వ ఉద్యమ దినోత్సవ వేడుకలు శనివారం ఎంవిపి.కాలనీ, సెక్టార్ 9 గొల్లవీధి క్లస్టర్‌లో జరిగాయి. సమాఖ్య కోస్టల్ రీజనల్ కో - ఆర్డినేటర్ ధనలక్ష్మి కళంజియ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వార్డు కార్పొరేటర్ మంగవేణి మాట్లాడుతూ మహిళలు అన్నింట్లో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా సుహం మొబైల్ వ్యాన్ డాక్టర్ హరికృష్ణ ఆరోగ్య సలహాలు అందించారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సాగరతీర కళంజియ సమాఖ్య కో ఆర్డినేటర్ సాయికృష్ణ, సత్య, దుర్గా భవాని, రత్న, దేవి, కృష్ణవేణి, పూర్ణ, వేణమ్మ, పద్మ, రాంబాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ములగాడ : దాన్ ఫౌండేషన్, మల్కాపురం కళంజియ సమాఖ్య ఆధ్వర్యాన ఎకెసి.కాలనీ, కుంచమ్మకాలనీ, నెహ్రూనగర్, ఇందిరాకాలనీ, జనతాకాలనీ, కాకరలోవ, దుర్గానగర్, చింతలలోవ ప్రాంతాల్లో శనివారం కళంజియం ఉద్యమ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్ ఫౌండేషన్ వైజాగ్ రీజియన్ కో-ఆర్డినేటర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ, కళంజియం పొదుపు సంఘాలు మల్కాపురం ప్రాంతంలో ప్రారంభించి 19 సంవత్సరాలు అయిందని, ఈ 19 ఏళ్ల ప్రగతిలో భాగస్వాములైన కళంజియం నాయకులు, సభ్యులకు అభినందనలు తెలిపారు. 62, 63వ వార్డు యుసిడి సిఒ భాను మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి అందించే అన్ని సదుపాయాలు కళంజియ సభ్యులందరికీ అందించేలా సహకరిస్తానని చెప్పారు. సమాఖ్య కో-ఆర్డినేటర్ సుభాషిణి మాట్లాడుతూ, దాన్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఆరోగ్య, విద్య, జీవనోపాధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ ప్రాంతాల్లో మిగిలిపోయిన పేదలందరినీ కళంజియ సభ్యులుగా చేర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ సెక్రెటరీ శ్రీనివాస్, 40వ వార్డు సిఒ శివ, సచివాలయ సిబ్బంది ఫణీంద్ర, సమాఖ్య నాయకులు, కళంజియం సభ్యులు పాల్గొన్నారు.

87వ వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : గాజువాకలో శనివారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జివిఎంసి 87వ వార్డు పరిధిలోని సమస్యలపై వైసిపి నాయకులు వినతిపత్రం అందించారు. 86, 87 వార్డుల పరిధిలోని స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాలనీల్లో ఆవులు, గేదెలు ఎక్కువగా ఉన్నాయని, పశు వులు ఆసుపత్రి నిర్మించాలని, 87వ వార్డు పరిధి వడ్లపూడి నుంచి కణితి గాంధీ బొమ్మ వరకు మెయిన్ రోడ్డు విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ అవుట్ లేట్ ఏర్పాటు చేయాలని కోరారు. బిఎల్‌సి లబ్ధిదారులకు స్కీమ్‌లు, హౌసింగ్ లోన్స్ గతంలో మంజూరైనా ఇప్పటివరకు నిధులు అందలేదని తెలిపారు. పాత లబ్ధిదారులకు బకాయిలు చెల్లిస్తూ, కొత్త లబ్ధిదారులకు లోన్లు, స్కీములు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. 87వ వార్డు పరిధిలోని సిద్దార్థ నగర్, కళింగ వీధి మధ్యలో ఉన్న జివిఎంసి వాటర్ ట్యాంక్ ఏరియా ప్రాంతంలో సర్వే నెంబర్ 1/6లో భూమి ఆక్రమణకు గురవుతుందని, దానిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి నాయకులు ప్రగడ వేణుబాబు, దుగ్గపు దానప్పలు, ముద్దపు దామోదర్, బోండా గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

సామాజిక సాధికార యాత్రలో మంత్రులు విశ్వరూప్, సిదిరి, గుడివాడ

ప్రజాశక్తి -యంత్రాంగం

ఎంవిపి.కాలనీ : తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర మంత్రి విశ్వరూప్ అన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా ఎంవిపి.కాలనీలోని ఎఎస్.రాజా కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్, చంద్రబాబు పాలనకు ఎంతో తేడా ఉందని అన్నారు. సామాజిక న్యాయానికి ఛాంపియన్ సిఎం జగన్ అని కొనియాడారు. డ్వాక్రా రుణాల మాఫీ పేరిట చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. నెల్లూరు శాసనసభ్యులు అనిల్ కుమార్ యాదవ్ జనసేన అధినేతవి పచ్చి అబద్ధాలని అన్నారు.

అసహనంతో జనం వెనక్కి..

కార్యకర్తలకు, ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్వాహకులు విఫలమయ్యారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కావాల్సిన సభ నాలుగు దాటిన తర్వాత ప్రారంభమైంది. సభాస్థలిలో వేచి ఉన్న కార్యకర్తలు ఎండ వేడిమి తాళలేక, కనీసం తాగడానికి నీరు లేక ఇబ్బందులు పడ్డారు. చాలా మంది అసహనంతో వెనుదిరిగారు. 20 వేల మంది హాజరవుతారని అంచనా వేసి కుర్చీలు వేయగా 80 శాతం కుర్చీలు ఖాళీగానే దర్శనమిచ్చాయి.

ఆరిలోవలో బస్సు యాత్ర ప్రారంభం

ఆరిలోవ : రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలతో పాటు మైనార్టీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. సామాజిక సాధికార బస్సు యాత్ర రెండో విడతను శనివారం 13వ వార్డు ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద గల వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించారు. దీనికి ముందుగా ఆరిలోవ కాలనీ క్రిష్టియన్ మైనార్టీ ఫంక్షన్ హాల్లో వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో అమర్‌నాథ్ మాట్లాడారు. తూర్పు నియోజకవర్గంలో కీలకమైన పదవులను బిసిలకు కట్టబెట్టారన్నారు. సిఎం జగన్ పాలనలో చేసిన మంచిని సామాజిక సాధికార యాత్ర ద్వారా వివరిస్తామన్నారు.

బస్సు యాత్రకు సంఘీభావ ర్యాలీ

ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద ప్రారంభమైన సామాజిక సాధికార బస్సు యాత్రకు సంఘీభావంగా 10, 11, 12, 13 వార్డుల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ బైకు ర్యాలీగా బయలు దేరారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు నేడు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి సిదిరి అప్పలరాజు, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కోలా గురువులు, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి డిప్యూటీ మేయర్ సతీష్, కెకె.రాజు, కార్పొరేటర్ కెల్ల సునీత, కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రిసిదిరి అప్పలరాజు

గొల్లగుంట ముస్లిం శ్మశానవాటిక స్థలాన్ని రక్షించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

ప్రజాశక్తి- పరవాడ

మండలంలోని రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట గ్రామం ముస్లిం మైనారిటీలకు చెందిన స్మశానవాటికకు రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వీకుల కాలం నుండి స్మశానవాటికకు ఉపయోగిస్తున్న స్థలాన్ని కబ్జా చేసి, తమ సొంత స్థలంలో కలుపుకోవడానికి దౌర్జన్యం పూర్వకంగా దాని చుట్టూ ఉన్న పెన్సింగ్ పోల్స్‌ని రాత్రి సమయంలో విరగొట్టారని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని, మైనార్టీలకు రక్షణ కల్పించాలని కోరారు. గొల్లగుంట ముస్లిం స్మశానవాటికను రెవిన్యూ అధికారులు పక్కనే ఉన్న గెడ్డ వాగులో చూపించే ప్రయత్నం చేస్తున్నారని, వాస్తవంగా ఎవరైనా మరణిస్తే ముస్లిం సంప్రదాయం ప్రకారం ఖననం చేసి సమాధులు నిర్మించుకుంటారని, అలాంటిది నీరు ప్రవహించే గెడ్డ వాగుల్లో ఎలా ఖననం చేసి సమాధులు నిర్మిస్తారని ప్రశ్నించారు. రెవిన్యూ అధికారులు కబ్జా చేసేవారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే అలాంటి అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. మైనార్టీల స్మశానవాటికను రక్షణ కల్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్ ఆలీ, గ్రామ పెద్దలు అబ్దుల్ జలీల్, షేక్ యాసీన్, మదీనా, జాకీర్ హుస్సేన్, మహమ్మద్ రఫీ, అజారుద్దీన్, షేక్ బాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను పరిశీలిస్తున్న సిఐటియు నేత గనిశెట్టి తదితరులు

జెడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : తీవ్ర వర్షాభావ పరిస్థితులు జిల్లాలో నెలకొన్న నేపథ్యంలో తక్షణమే అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని అనకాపల్లి ఎంపిపి గొర్లి సూరిబాబు కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సమావేశంలో అనకాపల్లికి చెందిన పలు సమస్యలను అధికారుల దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ముఖ్యంగా గత ఏడాది కంటే 30 నుంచి 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో ఇప్పటికే వరి పంటలు దెబ్బతిన్నాయన్నారు. అనకాపల్లి మండలంలో 2 వేల 174 హెక్టార్లలో వరి నాటు వేయగా 526 హెక్టార్లు పంట పూర్తిగాఎండి పోయిందన్నారు. అనకాపల్లి మండలాన్ని ఎందుకు కరువు మండలంగా ప్రకటించలేదని అధికారులను నిలదీశారు. డ్వాక్రా సంఘాల్లో జరుగుతున్న అవినీతి, జగనన్న సంపూర్ణ పోషకాహారం దళితుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎంవిఆర్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి విశ్వరూప్

వైసిపిలోకి ముత్యాల వెంకటేశ్వరరావు..?

ఎంవిఆర్‌ను కలిసిన మంత్రి విశ్వరూప్

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరబోతున్నారా...? అందుకే మంత్రి విశ్వరూప్ ఎంవిఆర్‌ను కలిసారా...? అనే ఆసక్తికర చర్చ ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. అనకాపల్లిలోని ఎం.వి.ఆర్ నివాసంలో శనివారం మంత్రి విశ్వరూప్ ప్రత్యక్షం కావడం, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి చర్చలు జరపడం మరింత ఆసక్తిగా మారింది. ఎన్నాళ్లో వేచిన హృదయం అన్నట్లు ఎంవిఆర్ రాజకీయ రంగ ప్రవేశానికి అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆహ్వానం పంపిందా...? అందుకే మంత్రి వచ్చారా..? అనే చర్చ ప్రస్తుతం ఎంవిఆర్ అభిమానులతో పాటు జిల్లా ప్రజలలో ఆసక్తి రేపుతుంది.

కళా రంగానికి ఎంవిఆర్ ప్రోత్సాహం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

ఏ రంగమైనా ప్రోత్సహించాలన్న ఎవరికైనా సహాయం చేయాలన్న అనకాపల్లి జిల్లాలో ముందుగా గుర్తుకు వచ్చేది ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్) మాత్రమేనని తిమ్మరాజుపేట గ్రామ పెద్దలు పేర్కొన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో నాగులచవితిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి నిర్వహించిన నాటికల ప్రదర్శన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎంవిఆర్ హాజరయ్యారు. గ్రామ పొలిమేర మొదలు, ఊరి నడిబొడ్డు వరకు ముత్యాల వెంకటేశ్వరరావు మీద పూలవర్షం కురిపిస్తూ, భాజా భజంత్రీలతో, మందు గుండు సామాగ్రితో, కోలాటాలతో, మంగళ హారతులతో కడు రమ్యంగా నాటికల ప్రదర్శన జరిగే ప్రదేశం వరకు తీసుకొని వెళ్ళారు. ఆయన మంచితనాన్ని, మనస్తత్వాన్ని గుర్తించిన ఆ గ్రామ ప్రజలు ఆయనను కలిసేందుకు, పరిచయం చేసుకునేందుకు పోటీ పడ్డారు. అందరి యోగక్షేమాలు కోసం పరితపిస్తున్న ఎంవిఆర్ రాజకీయాల్లోకి రావాలని గ్రామ పెద్దలు కోరారు. గ్రామ మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాము- రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గ ఇంచార్జ్ అర్జీ సతీష్, కళాభిమానులు బీమరశెట్టి శ్రీనివాసరావు, కొయిలాడ దశావతారం, దొడ్డి కోటేశ్వరరావు, మళ్ళ సంజీవరావు, పి నరసింగరావు తో పాటు గ్రామంలోని మహిళలు, చిన్నారులు, ఎం వి ఆర్ యువసేన సభ్యులు, సంజూ బాబు టీం తదితరులు పాల్గొన్నారు.

వారణాసికి రైలు వేయడంపై ఎంపీ హర్షం

మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి, పక్కన డాక్టర్ విష్ణుమూర్తి

ప్రజాశక్తి -అనకాపల్లి

విశాఖపట్నం నుంచి వారణాసికి రైల్వే శాఖ రైలు వేయడంపై అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మోడీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ తో సమావేశ మందిరంలో శనివారం విలేకరుల సమావేశంలో వైసిపి సీనియర్ నాయకులు డాక్టర్ విష్ణు మూర్తితో కలిసి ఆమె మాట్లాడారు. వారణాసికి రైలు వెయ్యాలని పలుమార్లు పార్లమెంటులో తాను ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ ట్రైన్ వారంలో రెండుసార్లు ఆదివారం, బుధవారాల్లో విశాఖపట్నంలో ఉదయం 4.20 గంటలకు బయలుదేరి మర్నాడు ఉదయం 9.25 గంటలకు వారణాసి చేరుతుందన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ పిఎంజిఎస్‌వై పథకంలో భాగంగా 12 రోడ్లకు ప్రతిపాదనలు చేయగా ఇప్పటికే 11 రోడ్లు వేయడం జరిగిందన్నారు. మాడుగుల రోడ్డు 9.4 కోట్లతో నిర్మించాల్సి ఉందన్నారు. జనవరి నాటికి రోడ్ల పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్టీఆర్ క్రీడమైదానాన్ని కోటి రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పంచాయతీరాజ్ డిఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పెద మదీన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని పెదమదీన రోడ్డు పనుల ఆలస్యంపై ప్రజాశక్తి దినపత్రికలో 'శిలాఫలకం వేశారు.. పనులు మరిచారు..' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే పనులు ప్రారంభమయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. సుమారు నాలుగు నెలల క్రితం అట్టహాసంగా కొనికోట బంగారు మెట్ట రోడ్డు నుండి పిల్లవానిపాలెం జంక్షన్ వరకు పెద్ద మదీన గున్నంపూడి మీదుగా తారు రోడ్డు నిర్మాణానికి స్థానిక శాసనసభ్యులు ధర్మ శ్రీ పనులు ప్రారంభించారు. జెసిబిలతో రోడ్డు చదును చేయడానికి తవ్వించడంతో రోడ్డంతా రాళ్లు తేలిపోయి రాకపోకలకు ఇబ్బందులుగా ఉన్నాయి. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వందలాది మంది ప్రజలు ద్విచక్ర వాహనాలపై ఉపాధి పనుల కోసం అనకాపల్లి రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ప్రజల సమస్యను ప్రజాశక్తి పత్రికలో ప్రశ్నించడంతో ప్రజా ప్రతినిధులు అప్రమత్తమై సంబంధిత రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్ పై తీవ్రమైన ఒత్తిడిని తెచ్చి పనులు ప్రారంభించక పోతే కుదరదని చెప్పినట్లు సమాచారం. ఒకవైపు ప్రజలు అధికారులను ప్రజాప్రతినిలను తిట్టుకుంటున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రజాప్రతినిధులు శనివారం పిక్క డస్ట్ తో కూడిన మెటీరియల్ను రోడ్డుపై వేసి రోలర్ తో పనులు ప్రారంభించారు.. దీంతో ఈ రోడ్డుకి పై ప్రయాణించే ప్రయాణికులు హమ్మయ్య పనులు ప్రారంభమయ్యాయి అని ఊపిరి పీల్చుకుంటున్నారు.

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన దృశ్యం

దత్తత గ్రామాలను తరచుగా సందర్శించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : దత్తత గ్రామాలను కానిస్టేబుళ్లు తరచూ సందర్శించాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సిఆర్‌పిసి కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. స్పెషల్ టీం లను ఏర్పాటు చేసి పెండింగ్ నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేయటం ద్వారా నిందితులు ఇతర నేరాలకు పాల్పడకుండా అరికట్టవచ్చుని చెప్పారు. గంజాయి ఇతర ముఖ్యమైన కేసులలో ఉన్న నిందితులపై త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో శిక్షలు పడేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన 24 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలతో ఎస్పీ సత్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి.సత్యనారాయణ రావు, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ రాజ్, డీఎస్పీలు వి.సుబ్బరాజు, పి.శ్రీనివాసరావు, పి.నాగేశ్వరరావు, ట్రైనీ డీఎస్పీ జి.భాగ్యరెడ్డి, ఇన్స్పెక్టర్లు లక్ష్మణ్ మూర్తి, చంద్రశేఖర్, షైదపు నాయుడు, అప్పలనాయుడు, సతీష్, ఎస్సైలు రఘువర్మ, ప్రసాద్, భీమరాజు, జిల్లా సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బిసిలకు జగన్ ద్రోహం

ప్రజాశక్తి-అనకాపల్లి : బీసీలకు జగన్ రెడ్డి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కీలకమైన పదవులు, బాధ్యతలు పెత్తనం అంత జగన్ రెడ్డి సామాజిక వర్గం వారికే, బడుగులకు నామమాత్రం పదవులే ఇస్తున్నారని తెలిపారు. 56 బిసి కార్పొరేషన్ల పదవులు పొందిన వారికి విధులు, నిధులు లేవని, కేవలం వారిని ఉత్సవ విగ్రహాల ఉంచారని చెప్పారు. బడ్జెట్లో బీసీలకు కేటాయించిన నిధులను దారి మళ్లించి వారి ప్రయోజనాలకు గండి కొట్టారని మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు గింజల లక్ష్మణరావు, రేసపూడి రమణ, పూతి కోటేశ్వరరావు, గుర్రం నూకరాజు ఎంపిటిసి కనకారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేత నాగజగదీష్

నూకాంబిక ఆలయాన్ని సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి-అనకాపల్లి

దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ రామ సత్యనారాయణ శనివారం శ్రీనూకాంబిక ఆలయాన్ని సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి పలు సూచనలు చేశారు. దేవాలయ పునర్నిర్మాణం, ప్రాకార మండపం, మూడంతస్తుల రాజగోపురాల పనులు త్వరగా పూర్తిచేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇంజనీర్‌ను ఆదేశించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, కార్యనిర్వాహణ అధికారి బండారి ప్రసాద్ ఆధ్వర్యంలో దేవస్థాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఆయనను ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో వైసిపి యువ నాయకులు దాడి జయవీర్, ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రామ్మూర్తి, దేవాదాయ ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శేఖర్, కార్యనిర్వాహక ఇంజనీర్ దుర్గేష్, ఉప కమిషనర్ ఎన్ సుజాత, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కెజిబివిలో బేటీ బచావ్ బేటి బడావ్ కార్యక్రమంలో భాగంగా బాలవివాహాలు నిర్మూలించి సమాజాన్ని కాపాడాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి తెలిపారు. విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డు చూపిస్తూ వారికి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ అమ్మాయిలు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేసుకోవాలని తెలిపారు. చిన్న వయసులో వివాహాలు జరగడం వలన వచ్చే అనర్థాలను గురించి వివరించారు. ప్రభుత్వం ఆడపిల్లల గురించి అనేక చట్టాలను టోల్ ఫ్రీ నెంబర్లను తీసుకువచ్చాయని తెలిపారు ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి కోసూరి అన్నపూర్ణ అంగన్వాడీ కార్యకర్తలు మహిళ పోలీసులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణ సామాజిక న్యాయం అనే అంశంపై ఈనెల 22న విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న శనివారం ఓ ప్రకటనలో విలువునిచ్చారు. మనువాద మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దళిత, గిరిజన, ముస్లిం, క్రైస్తవులపై దాడులు పెరిగాయని తెలిపారు. దళిత స్త్రీలను మానభంగం చేసి హత్యలు చేస్తున్నారు. ఏ రోజు ఏ పేపర్ చూసిన ఇలాంటి ఘటనలే కనిపిస్తున్నాయని తెలిపారు. రాజ్యాంగం పేర్కొన్న పౌర హక్కులను కాలరాస్తూ మతోన్మాద భావ జాలాన్ని పెంచి పోషిస్తున్నారు.

తూర్పు కాపులను బిసి డిలో చేర్చాలి

ప్రజాశక్తి -బుచ్చయ్య పేట : కులగణన చేయు అధికారులకు మండలంలోని తూర్పుకాపులు తమ కుల వివరాలను పూర్తిస్థాయిలో అందజేయాలని తూర్పు కాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ముచ్చకర్ల అప్పారావు తెలిపారు. శనివారం బుచ్చయ్యపేట దుర్గాదేవి మండపంలో మండల స్థాయి తూర్పు కాపు సంక్షేమ సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన చేసి పూర్తిస్థాయిలో కుల జాబితాలను సిద్ధం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డొంకిన అప్పలనాయుడు సర్పంచ్, సుంకర లక్ష్మి, గోన్నా బత్తుల శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు, సుంకర శ్రీను, మాజీ సర్పంచ్ సుంకర సత్యారావు, గంటా చిరంజీవి, పాల సంఘ అధ్యక్షులు సుంకర బాబ్జి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని కోట్నీవీధి వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను వైసిపి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ శనివారం సందర్శించారు. హెల్త్ సెంటర్‌లో రోగులకు అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఇక్కడగల అన్ని డిపార్టుమెంట్‌లను సందర్శించారు. పరిశుభ్రతను పాటించాలని సూచించారు. హెల్త్ సెంటర్‌లో ప్రస్తుతం డాక్టర్ లేక రోగులకు అందాల్సిన వైద్యం పూర్తిస్థాయిలో అందడంలేదని, స్టాఫ్ నర్సులు ఇద్దరు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒకరు మాత్రమే ఇక్కడ పనిచేస్తున్నారని పలువురు రత్నాకర్ దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకువెళ్లి డాక్టర్‌ను నియమించేందుకు కృషి చేస్తామని రత్నాకర్ తెలిపారు. ఆసుపత్రి ఆవరణలోని అపరిశుభ్రంపై రత్నాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణలో లైట్లు, భద్రత కోసం గేట్లు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ ఏఈలను రత్నాకర్ ఫోన్‌లో కోరారు. జీవీఎంసీ 83, 84 వార్డుల పరిధిలోగల 9, 10 సచివాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కోరుకొండ రాఘవ, గాడి మధురినాయుడు, కోటిపల్లి జేజిబాబు, కోట్ని శ్రీనివాసరావు, కటారి దేముడు, కోడూరు త్రినాథ్, ఆడారి రవికుమార్, కోటిపల్లి శ్రీను, పలకా కాసులు, సూరిశెట్టి వికాస్, సయ్యద్ నాగూర్, ఉమ్మిన పైడిరాజు, రేబాక ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా-ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌కు బిగ్ స్క్రీన్ ఏర్పాటు

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో ఇండియా-ఆస్ట్రేలియా క్రికెట్ ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు బిగ్ స్క్రీన్‌ను బడిశాల యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ అభిమానులంతా పాల్గొని మ్యాచ్‌ను తిలకించాలని కోరారు.

గ్రంథాలయాల్లో వివిధ పోటీలు

అచ్యుతాపురంలో క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

మునగపాక రూరల్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో యుద్ధాల నివారణలో యుఎన్ఓ పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీ, నిత్యజీవితంలో యోగ ప్రాధాన్యత అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివ కోటి దుర్గ ప్రసాద్, శ్రీనివాసరావు, ఆశా దేవి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పెంటకోట తులసిరావు వ్యవహరించారు.

అనకాపల్లి : స్థానిక శాఖవీధి శాఖ గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు అధ్వర్యంలో శనివారం జివిఎంసి టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో వీరనారి ఝాన్సీ లక్ష్మీ భాయి చరిత్రపై వ్యాసరచన పోటీలు, జివిఎంసి పట్టణ ప్రాథమిక పాఠశాలలో చిత్ర లేఖనం, క్విజ్, డిబేట్ పోటీలు, చిన్నవీధి జివిఎంసి జార్జి ఎలిమెంటరీ పాఠశాలలో క్యారమ్స్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సుమారు 80 విద్యార్థులు పాల్గొనగా, 36 మంది విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో బల్లా నాగభూషణం, హెచ్ఎంలు కె.రుధిరారాణి, హసీనా బేగం, మాధవి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట శాఖ గ్రంథాలయంలో శనివారం వక్తృత్వ, వ్యాచరచన పోటీలు వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ పాలకుల కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథలయంలో గ్రంథాలయ అధికారి వి.శిరీష శనివారం విద్యార్థులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు రాధా కుమారి ఈ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిఈ స్కూల్ ఉపాధ్యాయులు నాగేశ్వరి, రామలక్ష్మి, మనోజ్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో ఐదవ రోజు శనివారం కవి సమ్మేళనం, సీనియర్స్, జూనియర్స్ విభాగంలో డిబేట్ కార్యక్రమం నిర్వహించారు. కవి సమ్మేళనంలో తెలుగు ఉపాధ్యాయులు నండూరి ప్రసున్న, ఎ.విజయదుర్గ, కె.నాగరత్నం, ఎస్.పార్వతి, బి.వెంకటలక్ష్మి, కె.మహాలక్ష్మి గ్రంథాలయాధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం గ్రంథాలయం ఆవరణలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు, ఏడు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని పెదబోదుగల్లం హైస్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చరవాణి (మొబైల్) వాడటంతో కలిగే ఉపయోగాలు, నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌వివిఎస్ ఆచార్యులు, పలువురు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

పాయకరావుపేట : స్థానిక గ్రంథాలయంలో సీనియర్స్, జూనియర్స్‌కు యోగా పోటీలను నిర్వహించారు. పాయకరావుపేట మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి చిట్టిబాబు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా వేములూరి వరప్రసాద్, వెంకట రమణ, ఎస్ సీతారామమూర్తి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి లక్ష్మణరావు, కమిటీ సభ్యులు సీతారామయ్య, రత్నం పాల్గొన్నారు

ఎంవిపి.కాలనీ : ఎంవిపి కాలనీ నగర శాఖ గ్రంథాలయంలో స్థానిక పాఠశాలల విద్యార్థులకు, ఎవిఎస్ రాజా మహిళా జూనియర్ కాలేజీ విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మహేష్, మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతమ్మధార: విశాఖ పౌర గ్రంథాలయంలో క్రియేటివ్ కామెడీ క్లబ్ ఆధ్వర్యాన ప్రత్యేక వినోదవల్లరి నిర్వహించారు. కొణతాలసురేష్ భక్తి గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నటరాజ నృత్య నికేతన్ నాట్యాచార్యులు బాబూరావు నేతృత్వంలో చిన్నారులు జానపద నృత్యాలను ప్రదర్శించారు. ఎం.జ్యోత్స్న, ఎం.మోనశ్రీ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌కె.రావు, వేమూల భాస్కరాచారి, తాతాభక్తుల లక్ష్మీ ప్రసాద్, తాతాచారి, మేడా మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మునగాడ : స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా మాట్లాడుతూ, పుస్తక సమీక్ష వల్ల నూతన ఆలోచనలు, సృజనాత్మకత శక్తి పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.ఆదిశేషు, వి.లక్ష్మీదేవి, వై అనసూయదేవి, రోజా, ప్రేమలత, అబీద బేగం, జ్యోత్స్న, సలోమి పలు పుస్తకాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి జి.శిరీష, అధ్యాపకులు త్రివేణి పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

నర్సీపట్నంటౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం అలరించింది. పెదబొడ్డేపల్లి తెలుగు స్కూల్ అసిస్టెంట్ టి.పరశురాముడు ప్రసంగం, కవితలు పాఠకులను అలరించాయి. గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్ కె.శ్రీనివాసులు సూచించారు. గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి జి.మురళీకృష్ణ, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

గొలుగొండ : గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో గ్రంథాలయ ప్రముఖులైన ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణ, గాడి చర్ల హరిసర్వోత్తమరావులకు నివాళ్లు అర్పించారు. అనంతరం మత్తు పదార్థాలు యువతపై ఎటువంటి ప్రభావంపై డిబేట్ నిర్వహించారు.

రోలుగుంట : 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రోలుగుంట గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయాధికారి వరలక్ష్మీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. కళాశాల లైబ్రేరియన్ మల్లికార్జునరావు, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, కేజీబివి వి.లక్ష్మీ హాజరయ్యారు. అనంతరం గ్రంథాలయ ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు.

ఫార్మా కంపెనీల బస్సులకు అడ్డుకట్ట వేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫార్మాసిటీ కంపెనీల బస్సుల వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐకి శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, బుగిడి నూక అప్పారావు, నరిసే చిరంజీవి, కుంచవారి చిన్ను, మగడా అప్పారావు తదితరులు అనకాపల్లి పట్టణ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ జె రమేష్‌కు సమస్యను వివరించారు. అనకాపల్లి సిటీ లిమిట్స్ లో ప్రైవేట్ వాహనాలు ముఖ్యంగా ఫార్మాసిటీ కంపెనీల బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆపి ఎంప్లాయిస్‌ని ఎక్కించుకుంటూ వారికోసం వెయిట్ చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నట్లు చెప్పారు. ఈ కంపెనీల బస్సుల డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారికి పార్కింగ్ ప్లేస్ లు నిర్ణయించి అక్కడ ఎంప్లాయిస్ వెయిట్ చేసే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు.

నోటీసు ఇవ్వకుండా రోడ్డు విస్తరణపై నిలదీత

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట జంక్షన్ నుంచి జలగల మదుము వరకు శ్రీశివరామ ఏజెన్సీ పెట్రోల్ బంక్ యజమానికి చెందిన సుమారు 20 సెంట్లు స్థలంలో రోడ్డు విస్తరణ చేపడుతుండడంతో సదరు యజమాని జీవీఎంసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమకు కనీసం నోటీసు ఇవ్వకుండా, రోడ్డుకు ఒక పక్కనే విస్తరణ ఎలా చేపడుతారని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణపై తాము హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నామని, హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా ఎలా పనులు చేస్తారని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ సేకరణ చేయాలి గాని అధికారులకు ఇష్టానుసారం ఎలా చేస్తారని వాగ్వాదానికి దిగారు. అయితే దీనిపై హైకోర్టు స్టే ఆర్డర్ చూపించాలని కోరడంతో, కేసు నెంబర్ మాత్రమే ఇచ్చిందని ఆర్డర్ వస్తుందని చెప్పడంతో, రోడ్డు విస్తరణ పనులను యథావిధిగా కొనసాగిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి అచ్యుతాపురం : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు చెప్పారు. అచ్యుతాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మండలాధ్యక్షురాలు కోన సంధ్య బుజ్జి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరు చేసామని తెలిపారు. ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి గ్రామాల అభివృద్ధికి 20 లక్షల రూపాయలు చొప్పున నిధులు మంజూరు చేశామన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే పరిష్కారం చూపించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి సభ్యుడు లాలము రాంబాబు, కో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నర్మల కుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పరవాడ : బెంగుళూరు కోషెంట్ క్విజ్ క్లబ్ ఆధ్వర్యాన ఈ నెల 20, 21 తేదీలలో బెంగుళూరులో జరుగు జాతీయ స్థాయి పోటీలకు స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులు నిఖిల్ కిషోర్, శ్రీధన్ టీమ్ వెళ్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి తెలిపారు. విశాఖపట్నంలో గత నెల 28 తేదీన నిర్వహించిన కాన్ క్విజ్ తాడోర్ 2023 స్కూల్ క్విజ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం, 15000 నగదు బహుమతి పొందినట్లు ఆమె వెల్లడించారు. నిఖిల్ కిషోర్, శ్రీధన్ జట్టును శనివారం సీఈఓ కె.నిశాంత్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-చోడవరం : ప్రతి గ్రామంలోనూ ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం నరసయ్యపేట గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ప్రజలతో మాట్లాడుతూ తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చేస్తున్న విధివిధానాల గురించి వివరించారు. ఈ నరసయ్యపేట గ్రామానికి ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తనకు తెలియజేస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నేడు రాజశేఖర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరిస్తున్నట్లు జడ్పిటిసి కర్రి సత్యం, వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు, మండల యువజన విభాగం అధ్యక్షులు సూరినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం , రైతు భరోసా, వైయస్సార్ హెల్త్ క్లినిక్, నాడు నేడు కార్యక్రమంలో పూర్తి చేసుకున్న పాఠశాల భవనాలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

దళిత యువకుడుపై దాడి కేసులో ..

డిఎస్‌పి మరోమారు విచారణ

- బాధితుడు, తల్లి నుంచి వివరాలు సేకరణ

విచారణ చేపడుతున్న డిఎస్‌పి సుబ్బరాజు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం మర్రివలస గ్రామంలో దళిత యువకుడు వారా కన్నయ్య (నాయుడు) పై హత్యాయత్న ఘటనపై అనకాపల్లి డిఎస్‌పి సుబ్బరాజు శనివారం మరోమారు విచారణ చేపట్టారు. గ్రామంలో జరిగిన ఘటన తీరును కన్నయ్య తల్లి రమణమ్మ ను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి లిఖిత పూర్వకంగా వాంగ్మూలనం తీసుకున్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న బాధిత కన్నయ్య నుంచి కూడా లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా బాధిత కన్నయ్య తనకు ఇప్పటికి హెచ్చరిక ఫోన్ కాల్స్ వస్తున్నాయని కేసు రాజీ కాకుంటే తర్వాత జరిగే పరిణామానాలపై కొంత మంది యువకులు బెదిరిస్తున్నారని డిఎస్‌పి సుబ్బరాజు దృష్టికి తెలిపాడు. దీనిపై స్పందించిన డి ఎస్‌పి తక్షణమే బాధిత కుటుంబానికి రక్షణ కల్పిస్తామని, మెరుగైన వైద్య సేవలు అందజేస్తామన్నారు.

ఇదిలా ఉండగా బాధిత దళిత యువకుని కుటుంబానికి ప్రభుత్వ సాయం తక్షణమే అందించాలని, నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చర్యలు చేపట్టాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ మార్తి అప్పలరాజు, దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్షులు యాదగిరి దాస్, అంబేద్కర్ ఇండియా మిషన్ నర్సీపట్నం డివిజన్ కార్యదర్శి సాల్మన్ రాజు తదితరులు డిమాండ్ చేశారు.శనివారం రాత్రి బాధిత కన్నయ్యను ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మహిళా సంఘాలపై ఉందని ఏపీఎం పార్వతీభాయ్ తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో సెర్ప్ కేంద్ర కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రకృతి వ్యవసాయం పై వీవోఏలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన కషాయాలను అందజేయాలని తెలిపారు. ప్రస్తుత కాల పరిస్థితుల్లో రసాయనాలు లేకుండా సహజ సిద్ధమైన ఎరువులతో నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం కషాయాలను పంటలపై పిచికారీ చేయడంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. అంతర పంటలకు, సరిహద్దు పంటలు వేసుకోవడానికి అవసరమైన విత్తనాలు రైతులకు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

నిరాహార దీక్షను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గొలుగొండ:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 20, 21వ తేదీన గాజువాకలో 30 గంటల నిరాహారదీక్ష జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పిలుపునిచ్చారు. శనివారం గొలుగొండ సాయిబాబా గుడి వద్ద నిరాహార దీక్ష పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ, ప్రత్యేక హోదా, విభజన హామీలు, ప్రజా సంక్షేమ పాలన, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి గద్దికెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురు బాబు, జిల్లా రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ, మేకా భాస్కరరావు పాల్గొన్నారు.

నాటు సారా తయారీపై నిఘా

ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- రావికమతం:జిల్లాలో నాటు సారా తయారీ, నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపడు తున్నామని అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ, నాటు సారా నిర్మూలనకు తమ సిబ్బంది నిత్యం శ్రమిస్తున్నారన్నారు. నాటు సారా తయారీ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన కేసులు నమోదు చేస్తున్నామన్నారు. బెల్లం పులుపును గుర్తించి ధ్వంసం చేస్తున్నామన్నారు. దీని నివారణకు నాటు సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడమే పరిష్కారమని భావించామని తెలిపారు. ఈ మేరకు జిల్లా లో ఈ ఏడాది 207 మంది నాటు సారా కేసులతో సంబంధం ఉన్న వారిలో 59 మందికి ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. 17 మందికి జగనన్న చేయూత పథకంలో లబ్ధి చేకూర్చామన్నారు. 11 మంది మహిళలకు డ్వాక్రా గ్రూపులో రుణం ఇప్పించి చిరు వ్యాపారాలు ఏర్పాటు చేయించామన్నారు. మరో 47 మందికి అదనపు లోన్లు మంజూరు చేయించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఇప్పటికే జిల్లాలో 43 ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి విద్యుత్ దీపాలు, జిబ్రా లైన్లు, స్టాపర్స్ తదితర జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. కొత్తగా మరో 40 రోడ్డు ప్రమాదాల ప్రాంతాలు గుర్తించామని వీటి వద్ద ప్రమాదాల నివారణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ చెప్పారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి ప్రమాదాలకు కారణమైన వారిపై 15వేల 528 కేసులు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 4వేల 807 మందిపై కేసులు పెట్టామన్నారు. దొంగతనాల నివారణకు గస్తీ చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఎఎస్పీ సుబ్బరాజు, రావికమతం ఎస్ఐ ఉమా మహేశ్వరరావులు,తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

బాల్య వివాహాలపై ఉద్యమించాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ ఉద్యమించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు పిలుపునిచ్చారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, తహసీల్దార్ అంబేద్కర్, ఐసిడిఎస్ పిఓ శ్రీవిద్య, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, ఏవో సీతారామరాజు కరపత్రాలను ఆవిష్కరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. బాల్య వివాహాలు చేసినా, చేయించినా, ప్రోత్సహించినా చట్ట రీత్యా నేరస్తులు అవుతారని గ్రహించాలన్నారు.ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే అడ్డుకుని సమాచారం ఇవ్వాలన్నారు.

గుంతల రోడ్లపై టిడిపి, జనసేన నిరసనలు

అనకాపల్లిలో నిరసన చేపడుతున్న నేతలు

తెలుగుదేశం జనసేన పార్టీల ఉమ్మడి పిలుపు గుంతల ఆంధ్రప్రదేశ్‌కి దారేది కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి, విశాఖ జిల్లాలోని పలు చోట్ల గుంతల మయమైన రోడ్లపై నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

అనకాపల్లి : గుంతలుగా ఉన్న రోడ్లను బాగు చేయాలని కోరుతూ టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యాన మండలంలోని బవులవాడ పంచాయతీ దర్జీనగర్ రోడ్డుపై ఉన్న గుంతల్లో వల వేసి చేపలు పడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరుచూరి భాస్కరరావు, ఇరు పార్టీల నాయకులు కోట్ని బాలాజీ, కర్రి బాబి, కొణతాల శ్రీనివాసరావు, పల్లెల గణేష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : టిడిపి జనసేన పార్టీల ఆధ్వర్యంలో పూడిమడక -అనకాపల్లి రహదారిపై భారీ ర్యాలీ చేశారు. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్, మాజీ ఎమ్మెల్సీ పప్పుల చలపతిరావు, టిడిపి, జనసేన నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, బి రాందాసు, ఆడారి మంజు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం/ చోడవరం రూరల్ : టిడిపి జనసేన పార్టీల ఆధ్వర్యంలో శనివారం గాంధీ గ్రామం గాంధీ విగ్రహం నుండి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి, జనసేన నాయకులు బత్తుల తాతయ్య బాబు, గూనూరు మల్లు నాయుడు, బొడ్డేటి నాగ గంగాధర్, పీవీఎస్ఎన్ రాజు, జి వెంకట సత్యనారాయణ, కర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: మండలంలో ఘాట్ రోడ్ జంక్షన్ నుండి సురవరం గ్రామం వరకు గుంతల రోడ్లపై మాడుగుల నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాడుగుల నియోజకవర్గం జనసేన సమన్వయకర్త రాయపరెడ్డి కృష్ణ మాట్లాడుతూ, రోడ్లు అధ్వానంగా ఉన్నా ప్రజలు ఇబ్బందులు పడుతున్న మంత్రి బూడి ముత్యాలనాయుడు పట్టించుకోకపోవడం పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. ప్రధాన రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, గర్భిణీలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. తెలుగుదేశం సమన్వయకర్త పివిజి కుమార్ మాట్లాడుతూ, రెండు జిల్లాల అనుసంధానం చేసే ప్రధాన రహదారి పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. త్వరలోనే ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మాడుగుల నియోజకవర్గ వీర మహిళా సురేఖ, మాడుగుల మండల నాయకులు గండెం రాంబాబు, రోబ్బా మహేష్, చీడికాడ మండలం నాయకులు గంటల వరహామూర్తి గుమ్మడి సంతోష్ (వైస్ ప్రెసిడెంట్) దిబ్బపలెం రాము తులసిరాం దేవరపల్లి మండల నాయకులు మునకలాపల్లి సురేష్, నాలుగు మండలాల ముఖ్య నాయకులు సీనియర్ జనసైనికులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి రహదారిపై ఏర్పడిన అన్ని గోతుల వద్దా టిడిపి, జనసేన కార్యకర్తలు కూర్చుని నిరసన తెలిపారు. రామకృష్ణ థియేటర్ వద్దకు చేరుకొని అక్కడున్న గుంత వద్ద మానవహారం చేపట్టారు. జగన్ రోడ్లపై తిరిగితే ప్రజలు పడుతున్న బాధలు ఏమిటో అర్థమయ్యేవని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ అన్నారు. కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం జనసేన కో-ఆర్డినేటర్ శివప్రసాద్ రెడ్డి, పాల్గొన్నారు.

గాజువాక : గాజువాక బిసి రోడ్డులో మహా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి రోడ్లపై తిరిగితే వాటి అధ్వాన పరిస్థితులు కనిపిస్తాయన్నారు. హెలికాప్టర్లమీద తిరుగుతున్న ఆయనకు రోడ్ల పరిస్థితి పట్టడంలేదన్నారు. జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు మాట్లాడుతూ, గుంతల మయమైన బీసీ రోడ్డును యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని కోరారు. వైసిపి ఎంపీ వెంచర్లకు, స్థానిక ఎమ్మెల్యే ఇంటి దగ్గర రోడ్డుకు, వారి అనుచరుల లే-అవుట్లకు రోడ్లు వేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గడసల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, బోండా జగన్, శ్రీనివాసరావు, దల్లి గోవిందరెడ్డి, పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం రామవరం రోడ్డులో టిడిపి, జనసేన ఇన్‌చార్జులు కోరాడ రాజబాబు, సందీప్ పంచకర్ల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు శ్రీను, బాబు, చంద్రరావు, మజ్జి శ్రీను, గోవిందు, బాలు, గంటా నూకరాజు, మీసాల సత్యనారాయణ, బొద్దాపు శ్రీను, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మాడుగులలో టిడిపి నేతల నిరసన

అవగాహన కల్పిస్తున్న ఎఒ

విత్తన శుద్ధిపై అవగాహన

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని కింతలి వల్లపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. రైతులకు విత్తన శుద్ధితో కలిగే ప్రయోజనాలను వివరించారు. పంటను చీడపీడలు ఆశించినప్పుడు విచక్షణ రహితంగా పురుగు మందులు పిచికారి చేయకుండా, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి తగు మోతాదులో మాత్రమే ఎరువులను ఉపయోగించడంతో మిత్ర పురుగులను రక్షించుకోవచ్చు అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి(రాంబాబు), ఉప సర్పంచ్ మట్ట గోవింద, ఎంపిటిసి బగుడు వరహాలమ్మ, కింతలి సహకార సంఘ పర్సన్ ఇంచార్జ్ తాళ్లపురెడ్డి సోమన్నదొర, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై నిరసన

ప్రజాశక్తి -రావికమతం: గ్రామ పంచాయితీ ఆమోదం లేకుండా ప్రభుత్వం సెల్ టవర్ నిర్మాణం చేయడంపై పొర్లుపాలెం గ్రామస్తులు నిరసన చేపట్టారు. మండలంలో తట్టబంద పంచాయతీ పొర్లు పాలెం గ్రామంలో సర్వే నెంబర్ 39 -2 ప్రభుత్వ స్థలంలో సెల్ టవర్ నిర్మాణానికి అవసరమైన స్థలం అప్పగించేందుకు తహసిల్దార్ మహేశ్వరరావు సిబ్బందితో కలిసి శనివారం వెళ్లారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సెల్ టవర్ నిర్మాణానికి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సెల్ టవర్ నిర్మాణంతో తాము ప్రాణాంతక వ్యాధులకు గురవుతామని ఆందోళన వ్యక్తం చేశారు సెల్ టవర్ నిర్మాణానికి స్థలం అప్పగిస్తే ప్రాణత్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు . ఈ సందర్భంగా తహసిల్దార్ మహేశ్వరరావు మాట్లాడుతూ, సెల్ టవర్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు మాత్రమే తాము అమలు చేస్తున్నామని, దీనిలో తమ ప్రయోజనాలు ఏమీ లేవని ప్రజలకు వివరించారు. ఈ గ్రామంలో ప్రభుత్వ భూమి వేరే ప్రాంతాల్లో ఉందని గ్రామస్తుల అంగీకారంతోనే సెల్ టవర్ నిర్మిస్తామని తెలిపారు. పంచాయతీ పరిధిలో సెల్ టవర్ నిర్మాణానికి పంచాయతీ ఆమోదం తీసుకోకపోవడంపై సర్పంచ్ గోకివాడ రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆపాలన్నారు.

నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

మాట్లాడుతున్న తహశీల్దార్

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బూత్ లెవెల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ జానకమ్మ సూచించారు. శనివారం ఆమె మండల సమావేశం మందిరంలో 52 మంది బూత్ లెవెల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాబితాల్లో డబుల్ ఎంట్రీలు, ఓటర్ ఇంటి అడ్రస్ సక్రమంగా చూడాలని, మరణించిన ఓట్లు తొలగించడంతో పాటు కొత్తగా నమోదైనా ఓట్ల వివరాలు, సవరణల పట్ల సమగ్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా బూత్ లెవెల్అధికారులు ప్రజలందరితో మమేకమై ఎటువంటి వివక్ష చూపకుండా ఎన్నికల జాబితా పారదర్శంగా రూపొందించాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో పలువురు అధికారులు నిర్లక్ష్య ధోరణి పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, ఆర్ఐ ఉర్ధవరావు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ఓటర్ల జాబితాలను పరిశీలించాలి

- నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఓటర్ల జాబితాను బిఎల్ఓలు క్షుణ్ణంగా పరిశీలన చేయాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం సూచించారు. శనివారం నర్సీపట్నం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముసాయిదా ఓటర్లను పరిశీలించి తది జాబితా విడుదల చేయాలన్నారు. అభ్యంతరాలను పరిశీలించి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహశీల్దార్ అన్నాజీరావు, ఎంపిడిఒ జయమాధవి పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

బేస్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో ప్రతిభను చాటిన నర్సీపట్నం మండలం వేములపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినిలు జి.నీలా, జె.దీపికలు సాధించిన ఘనత పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, విద్యా కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్లు రవి, సుమన్లను ప్రత్యేకంగా అభినందించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని పట్టం పంచాయతీ బూరు వలస, అమనగిరి, నడుము వీధి తదితర గ్రామాల్లో కుళాయిలు, వాటర్ ట్యాంకులకు శనివారం బ్లీచింగ్ చేయించామని పంచాయతీ కార్యదర్శి పి.చిన్నారావు అన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి మాకవరపాలెం: మండల సర్వసభ్య సమావేశ మందిరం లో ఎంపీపీ సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగింది. పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ప్రశ్నల పరంపరతో సభ కొనసాగింది. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను సభ్యులకు తెలియజేసే క్రమంలో ప్రజాప్రతినిధులు వేదిక ముందుకొచ్చి తమ సమస్యలను ఏ కరువు పెట్టారు. మండలంలో పైప్‌లైన్లు, విద్యాశాఖ, రెవిన్యూ లో, రీ సర్వే, ఓటర్ లిస్టులో ఉన్న పలు సమస్యలపై శెట్టిపాలెం సర్పంచ్ అల్లురామునాయుడు, రాచపల్లి ఎంపీటీసీ ఆర్‌వై పాత్రుడు, బూరుగుపాలెం ఎంపీటీసీ యర్రాపాత్రుడు, జెడ్ గంగవరం సర్పంచ్ వెంకటరమణలు అధికారులను ప్రశ్నించారు. అధికారులు స్పందించి సాధ్యమైనంత వరకు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాదరావు, ఇన్చార్జ్ ఎంపీడీవో సీతామాలక్ష్మి, వైస్ ఎంపీపీ రాజారావు, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఏఈ బాలకృష్ణ, జేఈలు రవి, శివ, ఏపిఎం చినబాబు పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

'ఆడుదాం ఆంధ్రా'పై శిక్షణ

ప్రజాశక్తి-సబ్బవరం : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని వాలంటీర్లకు మండలస్థాయి క్రీడ శిక్షణా కార్యక్రమం శనివారం జరిగింది. దీనిని ఎంపిడిఒ బి.రమేష్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడింటన్, కబాడీ, ఖోఖో తదితర క్రీడల్లో మండలంలోని మథర్ పబ్లిక్ స్కూల్, అంబేద్కర్ గురుకుల పాఠశాల, రావలమ్మపాలెం, నంగినారపాడు, మల్లునాయుడుపాలెం జెడ్‌పి హైస్కూళ్లు, గుల్లెపల్లి అక్షర స్కూల్, సబ్బవరం ఆర్కిడ్ స్కూల్ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమం మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అబ్దుల్ రెహమాన్, ఎంఈఒలు పాల్గొన్నారు.

కశింకోట : ఆడుదాం ఆంధ్రా శిక్షణ తరగతులు కశింకోట బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో శనివారం ప్రారంభమయ్యాయి. కశింకోట సచివాలయం వాలంటీర్ల అందరికీ పిడిలు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్, క్రికెట్ ఆటలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, హెచ్ఎం సుజాత పాల్గొన్నారు.

గొలుగొండ:ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి ఈ పోటీల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాట్మింటన్, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారికి గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి రఘురాం, పిడి టివి.రమణ, వలంటీర్లు పాల్గొన్నారు.

గొలుగొండలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

20న గాజువాకలో కార్మిక, రైతు సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడలో అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నా జరుగనున్న నేపథ్యంలో దానికి సన్నద్ధంగా గాజువాక లయన్స్ క్లబ్‌లో ఈ నెల 20న ఉమ్మడి విశాఖ జిల్లా సదస్సు జరుగుతుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. ఈ సదస్సులో అఖిలపక్ష కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ప్రసంగిస్తారన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి సకల ప్రజలపై దాడిని ఎక్కువపెట్టిందన్నారు.

దళిత యువకునిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అనకాపల్లి జిల్లా రావికమతం మండలం మర్రి వలస గ్రామంలో దళిత యువకుని దాడికి పాల్పడిన అధికార వైసిపి నాయకులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు వై.రాజు, జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు జగదాంబ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు.

19న కాపు సంక్షేమ సేన పిక్నిక్

ప్రజాశక్తి-రోలుగుంట:ఈ నెల 19న అడ్డురోడ్డు జంక్షన్ పక్కన మామిడి తోటలో జరిగే కాపు సంక్షేమ సేన పిక్నిక్ కార్యక్రమానికి మండలానికి చెందిన కాపులంతా హాజరు కావాలని చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్, మండల అధ్యక్షులు బలిరెడ్డి ఈశ్వరరావు కోరారు. ఆయన మాట్లాడుతూ కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ హోంమంత్రి చేగొండి హరి రామజోగయ్య నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు.

రిజిస్ట్రేషన్ లేని క్లినిక్స్‌పై చర్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : రిజిస్ట్రేషన్ లేని ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ -2002 ప్రకారం చట్ట పరమైన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నడుస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ -2002 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా https://clinicalesttact.ap.gov.in/, స్కానింగ్ కేంద్రాలకు https://pcpndt.ap.gov.in/ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

నేత్ర సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యాన శనివారం బాలల నేత్ర సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ -2 విజేత సౌజన్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల కళ్ళ గురించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. నేత్ర సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ స్నేహల్ గణత్ర మాట్లాడుతూ, చిన్నారుల నేత్ర సంరక్షణకు ఐదు మంచి అలవాట్లు గురించి వివరించారు. అనంతరం నేత్ర సంరక్షణకు పాటించాల్సిన ఐదు అలవాట్లపై చిన్నారులు వేసిన లఘు నాటిక ఆలోచింప చేసింది. వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలైన బాలలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.రామ్‌కుమార్, శోభారాణి, డాక్టర్ వీరేంద్ర సచ్ దేవా తదితరులు పాల్గొన్నారు.